క్లుప్తంగా

విద్యతోపాటు క్రీడలు కీలకం



కప్ అందజేస్తున్న ఎంఈఓ అంజాగౌడ్

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందని ఎంఈఓ దోమకొండ అంజాగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన అండర్ 14 వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చూపిన ఖాజీపూర్ విద్యార్థినులు అర్చన, సృజన, ఐశ్వర్య, కీర్తి, శృతి, సాహితి, నిహారిక, మౌనికను సోమవారం ఆయన అభినందించారు. దాతల సహకారంతో వారికి స్పోర్ట్స్ షూస్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన విద్యార్థులే అన్నిరంగాల్లో రాణిస్తారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జగన్మోహన్‌రాజు, పీడీ నరేశ్, మాజీ సర్పంచ్ మమత, నాయకులు చిరంజీవి, మధు, సుధాకర్‌రెడ్డి, దుబ్బ రాజయ్య, టీచర్లు లక్ష్మీనర్సింహులు, సుముకేశ్వర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్యామల, పద్మ, ధన్‌రాజ్, స్వామి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు



టీ షర్టులు అందిస్తున్న లింగమూర్తి

హుస్నాబాద్‌రూరల్: గ్రామాలను స్వచ్ఛ్ గ్రామాలుగా మార్చే బాధ్యత పారిశుద్ధ్య కార్మికులదేనని జిల్లా గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి అన్నారు. మండలంలోని 17 గ్రామాల పారిశుద్ధ్య కార్మికులకు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు అందజేసిన రెండు జతల టీ షర్టులను సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కావాల్సిన నిధులను మంత్రి పొన్నం తీసుకువస్తున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి, బొలిశెట్టి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యలు పరిష్కారం కాదు



నివాళులర్పిస్తున్న ఆపరేటర్లు

దుబ్బాకటౌన్: సమస్యల పరిష్కారానికి ఆత్మహత్యలు పరిష్కారం కావని, ఏదైనా సమస్య వస్తే ధైర్యంగా పరిష్కార మార్గాలను ఆలోచించాలని ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ దుబ్బాక మండల అధ్యక్షుడు సంతోష్ కుమార్ అన్నారు. నల్గొండ జిల్లా తుంగతుర్తి ఎంపీడీఓ కార్యాలయంలో ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న సోమిరెడ్డి జీతాలు అందక ఆర్థిక సమస్యలతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ఆపరేటర్లు మౌనం పాటించారు. జీతాల విషయంలో మనస్థాపం చెందవద్దని కోరారు. కార్యక్రమంలో ఆపరేటర్లు కరుణాకర్ తదితరులున్నారు.

నేడు అమరవీరుల సంస్మరణ సభ



మాట్లాడుతున్న శశిధర్

మద్దూరు(హుస్నాబాద్): సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న అమరవీరుల సంస్మరణసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్ పిలుపునిచ్చారు. దూళ్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లిలో సంస్మరణ సభ ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బైరాన్‌పల్లి అమరవీరుల త్యాగలను స్మరిస్తూ వారి ఆశయాలను ముందుకు తీసుకుపోవడంలో తమ పార్టీ ముందు ఉందన్నారు. రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కార్యవర్గ సభ్యుడు చుక్క రాములు హాజరవుతారని చెప్పారు. నాయకులు సత్తిరెడ్డి, వెంకట్‌మావో, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొండపాక(గజ్వేల్): మండలంలోని బందారం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ సత్యం సోమవారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని, అలాగే దుద్దెడ సబ్‌స్టేషన్ నుంచి బందారం, అంకిరెడ్డిపల్లి, కొండపాక, జప్తినాచారం, దమ్మక్కపల్లి, దర్గా గ్రామాలకు సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

దిగుబడిపై దిగాలు

వర్షాలతో దెబ్బతిన్న పంటలు
- పొలాల్లో నిలిచిన నీరు
- ఎర్రబడుతున్న పత్తి పంట
- ఆందోళనలో అన్నదాతలు



తిగుల్ గ్రామంలో ఎర్రబడిన పత్తి పంట

వరుసగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావం పంటచేలపై తీవ్రంగా పడింది. వర్షాల కారణంగా రైతులు సాగు చేసిన పత్తితోపాటు వరి పంటకు కూడా చాలా నష్టం వాటిల్లే దుస్థితి నెలకొంది. ముఖ్యంగా పత్తి పొలాల్లో వర్షపునీరు నిలిచి సాగు ఎర్రబడింది.

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని 29 గ్రామాల్లో వానాకాలం సీజన్‌లో 14,200 ఎకరాల్లో పత్తి, 10 వేల ఎకరాల్లో వరి, 221 ఎకరాల్లో మొక్కజొన్న, 50 ఎకరాల్లో కంది పంట సాగు చేశారు. అలాగే 300 ఎకరాల్లో కూరగాయాల పంటలు వేశారు. మండలంలో నల్లరేగడి భూములు ఎక్కువగా ఉండడం వల్ల ఇక్కడి రైతులు పత్తిసాగుకే మొగ్గుచూపుతారు. తిగుల్, అలిరాజ్‌పేట, ఇటిక్యాల, లింగారెడ్డిపల్లి, జగదేవ్‌పూర్, గొల్లపల్లి, మునిగడప, చాట్లపల్లి, వట్టిపల్లి, బిజివెంకటాపూర్ గ్రామాల్లో పత్తి పంటను ఎక్కువగా సాగు చేశారు. మిగతా గ్రామాల్లో పత్తితోపాటు వరికూడా సాగు చేశారు. అలాగే బస్వాపూర్, తిమ్మాపూర్, ఎల్లాయిగూడ గ్రామాల్లో కూరగాయల పంటలు కూడా సాగుచేశారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

భారీ వర్షాల వల్ల పొలంలో నీరు నిలిచిపోయి పత్తి పంట ఎర్రబడుతోంది. ఎకరానికి సుమారు నలుభై వేలకు పైగా పెట్టుబడి పెట్టాం. ప్రస్తుతం పంటను చూస్తుంటే పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించి పత్తి రైతులను ఆదుకోవాలి.

– బీరయ్య, పత్తిరైతు, తిగుల్

పెట్టుబడి కూడా దక్కేలా లేదు..

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి పంటలో నీళ్లు నిలిచి పంట ఎర్రబడి కాత, పూత లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎర్ర భూముల్లో సాగు చేసిన పత్తి కొంత భాగానే ఉన్నప్పటికీ నల్లరేగడి భూముల్లో సాగుచేసిన పత్తి పంట మాత్రం ఎర్రబడి పంట ఎదుగుదల ఆగిపోయింది. రెండు రోజులుగా మళ్లీ వర్షం కురవడంతో పత్తి రైతులు మంరింత ఆందోళనలో పడ్డారు. ఈ భారీ వర్షం చివరి ఆశలు కూడా లేకుండా చేసిందని వాపోతున్నారు. ప్రస్తుతం పెట్టిన పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి ఉందని దిగులు చెందుతున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది.

సామాజికసేవలో భాగస్వాములుకండి

ప్రిన్సిపాల్ అనిత అబ్రహం



ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు తప్పనిసరిగా సామాజికసేవలో భాగస్వాములు కావాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం అన్నారు. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్(జాతీయ సేవా పథక దినోత్సవం) వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సౌజన్య, డాక్టర్ సరోజతో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాధ్యత గల పౌరులను తయారుచేసే శక్తివంతమైన ఉద్యమం ఎన్ఎస్ఎస్ అన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు సమాజసేవలో పాల్గొనాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియాన, అధ్యాపకులు డాక్టర్ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

జామియత్ ఉలేమా జిల్లా నూతన కార్యవర్గం



జామియత్ ఉలేమా నూతన కార్యవర్గం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జామియత్ ఉలేమా జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ముఫ్తీ ముహమ్మద్ అబ్దుల్ సలాం ఖాస్మీని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా ముఫ్తీ కలీముద్దీన్ సాహెబ్ ఖాస్మి, ముహమ్మద్ జునైద్ సాహెబ్ తాజిర్, ముహమ్మద్ యూసుఫ్ బాబా సాహెబ్, అజామ్ అలీ జావేద్ సాహెబ్ తాజిర్‌ను, ప్రధాన కార్యదర్శిగా హఫీజ్ అబ్దుల్ మజీద్‌ను ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. జామియత్ ఉలేమా కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముఫ్తీ యూనుస్ అల్–ఖాస్మీ, ఉపాధ్యక్షుడు ముఫ్తీ గియాస్ మొహియుద్దీన్ ఖాస్మీ పరిశీలకులుగా వ్యవహరించారు.

అపరిచితులతో అప్రమత్తం

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని సీఐ రవికుమార్ అన్నారు. బూర్గుపల్లి ఉన్నత పాఠశాలలో సోమ వారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. పట్టణంలోని దుకాణాలు, అనుమానాస్పద ప్రాంతాలలో డ్రగ్స్, మత్తు పదార్థాల కోసం నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు.

అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేయొద్దు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య



ఐసీడీఎస్‌లో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, సీఐటీయూ నాయకులు

గజ్వేల్‌రూరల్: అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేయకుండా ప్రీ ప్రైమరీ, పీఎం శ్రీవిద్యను సైతం ఇదే కేంద్రాల్లో నిర్వహించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యావిధానంలో భాగంగా ప్రీ ప్రైమరీ, పీఎం శ్రీవిద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఐసీడీఎస్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సోమవారం ధర్నా నిర్వహించి సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎల్లయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడంతోపాటు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 25న జరిగే ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రంగారెడ్డి, అంజలి, నాగరాణి, స్వాతి, దివ్య, పద్మ, మీరాబాయి, వినోద, సువర్ణ, ఉమాదేవి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

హామీ మేరకు పెన్షన్లు పెంచాలి

ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి పెన్షన్‌దారులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, పెన్షన్‌లు పెంచాలని ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పింఛన్‌దారులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం ఆయా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టి సంబంధిత అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. గజ్వేల్‌లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మైస రాములు, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆంజనేయులు మాట్లాడారు. అలాగే హుస్నాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనగందుల లక్ష్మీనారాయణ, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య పాల్గొన్నారు. దివ్యాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులకు రూ.4 వేలకు పెన్షన్ పెంచుతామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, వెంటనే ఆ హామీలు నిలబెట్టుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.



చేర్యాల(సిద్దిపేట): తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు, పెన్షన్ దారులు



మద్దూరు(హుస్నాబాద్): పింఛన్‌దారులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



గజ్వేల్: గజ్వేల్‌లో ఐఓసీ వద్ద ధర్నా



హుస్నాబాద్‌లో ధర్నా చేస్తున్న పెన్షన్ దారులు, దివ్యాంగులు



మర్కూక్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా



కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలో..



మిరుదొడ్డి(దుబ్బాక): దివ్యాంగుల ఆందోళన



జగదేవ్‌పూర్(గజ్వేల్): తహసీల్దార్ కార్యాలయం ఎదుట..



చిన్నకోడూరులో..

స్థానిక ఎన్నికల్లో మూల్యం తప్పదు

బీఆర్ఎస్వీ రాష్ట్ర నేత పర్వతాలుయాదవ్



పర్వతాలు

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్రంలో కొనసాగుతున్న రేవంత్‌రెడ్డి అసమర్థ పాలన వల్ల రానున్న స్థానిక ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలుయాదవ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బిల్లులు చెల్లించట్లేదని, ప్రైవేట్ ఆస్పత్రులల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడం, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులు ఇవ్వడం లేదని వాపోయారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలైన విద్యార్థులకు నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికలు నిర్వహించక పోవడంతో గ్రామాల్లో అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ కష్టంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డీజిల్‌కు డబ్బుల్లేక చెత్త సేకరణ ట్రాక్టర్లు కూడా మూలనపడ్డాయని, రైతు రుణమాఫీ, పంటకు బోనస్, కూలీలకు ఆత్మీయ భరోసా వంటి అనేక హామీలు తుంగలో తొక్కారని మండిపడ్డారు. చివరకు రైతుకు సరిపడా యూరియా అందించడంలో కూడా విఫలమయ్యారన్నారు.

ప్రతిభ చాటితేనే సమాజంలో గుర్తింపు

ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్



ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ నిఖత్ అంజుమ్

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు తమలోని ప్రతిభను చాటి ఉన్నత స్థానాల్లో నిలిచినపుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఘనంగా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వండితెచ్చిన వంటకాలను రుచి చూసి వారిని అభినందించారు. అనంతరం సోషల్‌సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఓటింగ్ విధానం, రాజ్యాంగ ఆవశ్యకత, ప్రజాస్వామ్య పరిరక్షణకు సంబంధించిన అంశాలను రూపొందించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, అధ్యాపకులు రామచంద్రం, కవిత, పెద్దిరాజు, ఎం.భవాని, వెంకటేశ్వర్లు, విజయభాస్కర్‌రెడ్డి, మహేందర్, లక్ష్మీనర్సయ్య, మార్కండేయ, శివ, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినులందరికీ ప్రభుత్వ సహకారం

జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి



కేక్ కట్ చేస్తున్న మహిళా కాంగ్రెస్ నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): రానున్న కాలంలో రాష్ట్రంలోని విద్యార్థినులందరికీ ప్రభుత్వం మరింత సహకరిస్తుందని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి అన్నారు. కాంగ్రెస్ మహిళ విభాగం ఏర్పడి 40 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండలంలోని అయినాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థినులతో కలసి సోమవారం కేక్ కట్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రానున్న కాలంలో మహిళలు మరింత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఓట్లు చోరీచేసి గద్దెనెక్కారని, వచ్చే ఎన్నికలలో మహిళలు బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి చెరుకు సుమలత, కవిత, కళావతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

‘పోషణ్ బీ.. పడాయి బీ’ పై శిక్షణ

సీడీపీఓ ఎల్లయ్య



మాట్లాడుతున్న సీడీపీఓ ఎల్లయ్య

దుబ్బాకటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు చదువులోనూ, శారీరకంగానూ అభివృద్ధి చెందేలా చేయడమే పోషణ్ బీ–పడాయి బీ కార్యక్రమ లక్ష్యమని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఎల్లయ్య అన్నారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో ప్రాజెక్టు పరిధిలోని 200 మంది అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ‘పోషణ్ బీ–పడాయి బీ’ కార్యక్రమ శిక్షణను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. చిన్నారుల సంరక్షణ, వారి ప్రీ ప్రైమరీ విద్యపై దృష్టి సారించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో పోషణ్ అభియాన్ కో ఆర్డినేటర్ శామ్సన్, సూపర్‌వైజర్లు చంద్రకళ, స్వరూప, రాజేశ్వరి, రేణుక, విజయలక్ష్మి, గిరిజ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ ఎంపికలు



గజ్వేల్‌లో నిర్వహించిన కబడ్డీ సెలక్షన్స్‌లో ఎంపికైన బాలబాలికలు

గజ్వేల్: గజ్వేల్‌లోని ఐఓసీ వెనుక భాగంలో ఉన్న మైదానంలో సోమవారం జిల్లా స్థాయి బాలబాలికల కబడ్డీ ఎంపికలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 200 మంది క్రీడాకారులు ఈ ఎంపికల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం రాష్ట్రస్థాయి జట్టును ఎంపిక చేశారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్సీ సంతోష్, ప్రధాన కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఘనంగా హిందీ దినోత్సవం

తొగుట(దుబ్బాక)/చిన్నకోడూరు(సిద్దిపేట): తొగుట, చిన్నకోడూరు మండలం అనంతసాగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో హిందీ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతమాత చిత్రపటానికి పూలమాలలువేసి కార్యక్రమాలు ప్రారంభించారు. హిందీపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎంలు ఉపేందర్, జ్యోతి, ఉపాధ్యాయులు దుర్గయ్య, శ్రీదేవి, సమ్మయ్య, కవిత, నరేశ్, పరశురాములు పాల్గొన్నారు.

◆ విద్యార్థి దశ చాలా కీలకం

హుస్నాబాద్: విద్యార్థి దశ చాలా కీలకమైనదని సీఐ శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థినులకు చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ లలిత, అధ్యాపకులు, షీ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

◆ బోధన పటిష్టం చేయడానికే..

దౌల్తాబాద్(దుబ్బాక): ఉపాధ్యాయుల విద్యాబోధన పటిష్టం చేయడం కోసమే ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, ప్రతి ఉపాధ్యాయుడూ ఒక నిత్య విద్యార్థేనని ఎంఈఓ గజ్జెల కనకరాజు అన్నారు. జెడ్పీ బాలుర పాఠశాలలో సోమవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హెచ్ఎం అనిల్‌కుమార్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ సమస్యల పరిష్కారానికి వినతి

సిద్దిపేటరూరల్: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ గెజిట్ ప్రకారం జీతాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

◆ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయండి

సిద్దిపేటకమాన్: ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌బకాయిలను విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆదిత్య డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్కాలర్‌షిప్‌లను విడుదల చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

◆ సాయుధపోరాట వారసులు కమ్యూనిస్టులే

బెజ్జంకి(సిద్దిపేట): సాయుధపోరాట వారసులు కమ్యూనిస్టులేనని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట 77వ వార్షికోత్సవం సందర్భంగా బెజ్జంకిలో సోమవారం చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రూపేశ్, మధు, బాలమల్లు, బాబు తదితరులు పాల్గొన్నారు.

◆ వైద్యపరికరాల అందజేత

దుబ్బాక: ప్రముఖ వైద్యుడు కొమరవెల్లి కల్యాణ్ కుమార్ ప్రభుత్వ ఆస్పత్రికి వైద్యపరికరాలు అందించారు. తాను విధులు నిర్వహించిన ఆస్పత్రికి రూ.30 వేలు విలువైన పరికరాలు సూపరింటెండెంట్ హేమరాజ్‌సింగ్‌కు సోమవారం అందించారు.